

శుక్రవారం 13 నవంబర్ 2026 పేజీలు : 8

పోలీస్ వాహనాల పనితీరుపై సీపీ ఆకస్మిక పరిశీలన



ప్రజలకు మేలు జరిగేలా భూముల లీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 11,(ప్రజా జ్యోతి)

భూముల లీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, ప కట్టదీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవె న్యూ, హౌసింగ్, పౌర సం బంధాల శాఖ మంత్రి పాం గులేటి శ్రీనివాస్ రెడ్డి అధి కా రులను ఆదేశించారు. లీస ర్వేలో నాణ్యతకు ప్రా ధాన్య త ఇవ్వాలని, తొందరపాటు తో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహిం చిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి లీసర్వే పురోగతిని స మీక్షించారు. నవంబర్ నెలా ఖరులోగా ప్రతి జిల్లాలో తొ లి విడతగా ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో లీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశిం చారు. ప్రతి మండలంలో ప్ర త్యేక సర్వే బృందాలను ఏ ర్పాటు చేసి, లైసెన్స్‌డ్ సర్వే యర్ల సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. లీసర్వే సమయంలో రైతుల కు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో నే సర్వే నిర్వహించాలని, అ భ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని తెలిపా రు. అసైన్డ్ భూముల పట్టా లు, భూముల విస్తీర్ణం, ప్ర భుత్వ భూములు, గతంలో సేకరించిన భూముల వివ రాలను క్షుణ్ణంగా పరిశీలిం చాలని ఆదేశించారు. రా బో యే ఏడాదిన్నరలో మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే పూర్తి చేయాలని ప్రభు త్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. లీసర్వేలో అక్ర మాలు, అవకతవకలకు పా ల్పడే అధికారులపై సస్పెన్ష న్‌తో పాటు క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని హె చ్చరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీ వో జగదీశ్వర్ రావు, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ వివాదాలపై అవగాహన కల్పించేలా 'రైతుకు రక్షణ' లఘు చిత్రం



భూ సమస్యలకు కుటుంబ సభ్యుల పరస్పర అంగీకారమే పరిష్కారం

కలెక్టర్ కుమార్ దీపక్

ప్రతి కేసు లో నేరస్తులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు జరగాలి

విధులలో చురుకుతనం, నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి పోలీస్ యూనిఫామ్ సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెంచుతుంది

ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి



నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడుకోవాలి

క్వాలిటీ నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జీఎం మునిగంటి శ్రీనివాస్

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): బొగ్గు ఉత్పత్తి రంగంలో పోటీ మార్కెట్‌ను తట్టుకొని సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాలు-2026లో భాగంగా గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో క్వాలిటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి బొగ్గు నాణ్యత ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలు తక్కువ ధరలకు బొగ్గు సరఫరా చేస్తున్న నేపథ్యంలో వినియోగదారులను నిలబెట్టుకోవాలంటే నాణ్యమైన బొగ్గు సరఫరా ఒక్కటే మార్గమన్నారు. ఒప్పందాల ప్రకారం నాణ్యతతో కూడిన బొగ్గును సరఫరా చేయకపోతే వినియోగదారులను కోల్పోవడమే కాకుండా భారీగా అపరాధ రుసుములు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. నాణ్యత లోపాల కారణంగా సింగరేణి సంస్థ ఏటా సుమారు రూ.400 కోట్ల మేర నష్టపోతోందని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ నాణ్యత ప్రమాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.నవంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో నాణ్యత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు బొగ్గు నాణ్యతపై అవగాహన కల్పించి, నాణ్యమైన



ఉత్పత్తి సాధనకు ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రేడ్ సంతృప్తి సాధనలో సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియా మొదటి స్థానంలో నిలవగా, 2025-26లో రెండో స్థానానికి పరిమితమైందని తెలిపారు. ఈసారి క్వాలిటీ విభాగం క్షేత్రస్థాయిలో మరింత ప్రత్యేక దృష్టి సారించి శ్రీరాంపూర్ ఏరియాను తిరిగి ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, ఎస్ఓ టు జీఎం కృష్ణప్రసాద్, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, ఏరియా క్వాలిటీ ఇన్‌ఛార్జి శ్రీధర్ రావు, డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సత్యనారాయణ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఏరియా సర్వేయర్ నర్సింగరావు, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డీవైపీఎం క్రాంతి కుమార్, పిట్ సెక్రటరీ సందీప్, జీఎం కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

చట్టబద్ధమైన సెలవులు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ టీ. శ్రీధర్‌కు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ, గతంలో ప్రతి మూడేళ్లకోసారి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేవారని, ప్రస్తుతం నాలుగేళ్లు దాటినా వేతనాల పెంపు చేపట్టలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విధుల్లో చేరే కార్మికులకు కనీసం రూ.16 వేల వేతనం చెల్లించేలా జీవో నంబర్ 6 జారీ చేసిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పదేళ్ల నుంచి ఇరవై ఏళ్ల సర్వీసు కలిగిన కార్మికులకు వారి అనుభవం, సేవలను పరిగణనలోకి తీసుకొని నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు.అలాగే చట్టప్రకారం పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని ప్రతి సంవత్సరం ఒక నెల వేతనాన్ని బోనస్‌గా చెల్లించాలని, ఒక్కొక్క కార్మికుడికి రెండు జతల యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాలను నిబంధనల ప్రకారం కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.కాంట్రాక్టర్లు కార్మికుల పూర్తి వేతనంపై ఈఎస్ఐ, పీఎఫ్ మినహాయింపులు చూపుతున్నప్పటికీ, వాస్తవంగా కార్మికుల ఖాతాల్లో తక్కువ మొత్తాలు జమ చేస్తున్నారని ఆరోపించారు. చట్టప్రకారం కార్మికుల వాటాతో పాటు యాజమాన్య వాటాను కూడా



సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించని పక్షంలో ముఖ్య యజమానిగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు.గత ఆగస్టు 9న డీఎంఈ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా సందర్భంగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని అప్పటి డీఎంఈ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించినప్పటికీ అమలు కావడం లేదన్నారు. వెంటనే నూతన కాంట్రాక్టర్లను ఆహ్వానించి, కార్మికులకు న్యాయమైన వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలిందర్ అలీ ఖాన్, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు రాయమల్లు, మధు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రి కరణ పథకంలో భాగంగా37 రకాల యంత్రాలు పనిముట్లు రైతులకు సబ్సిడీపై అందజేయడం జరుగుతుంది

ఎస్సీ ఎస్టీ రైతులకు 50 శాతం,బీసీ రైతు లకు40శాతం రాయితీ పై అందజేయడం జరుగుతుంది

ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్, సాయిల్ హెల్త్ కార్డ్, రెండు ఫోటోలు, ట్రాక్టర్ కి సంబంధించిన పనిముట్లు తీసుకుంటే ఆర్సి జిరాక్స్ జత కార్యాలయంలో తనను సంప్రదించాలి :

దహేగాం మండలం కొత్మీర్ క్లస్టర్ ఏఈఓ:

నవంబర్ 12, దహేగాం ప్రతినిధి, ప్రజాజ్యోతి:కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజకవర్గంలోని దహేగాం మండలం కొత్మీర్ గ్రామ క్లస్టర్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యంత్రీకరణ పథకంలో భాగంగా 37 రకాల యంత్రాలు పనిముట్లను సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతుందని కొత్మీర్ క్లస్టర్ ఏఈఓ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ. దహేగాం మండల కేంద్రంలోని కొత్మీర్ క్లస్టర్ గ్రామ రైతులకు రైతు యంత్రీకరణ పథకం లో భాగంగా 37 రకాల యంత్రాలు పనిముట్లను సబ్సిడీపై అందజేస్తున్నా మని అన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులకు 50 శాతం బీసీ రైతులకు 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. యంత్రాలు పనిముట్లు కావలసిన ఆసక్తి గల రైతులు ఆధార్, పట్టా పాస్ బుక్ జిరాక్స్,సాయిల్ హెల్త్ కార్డ్,దరఖాస్తు ఫారం రెండు ఫోటోలు, నాతోపాటు ట్రాక్టర్ ఉన్న రైతులు ట్రాక్టర్ కు సంబంధించిన యంత్రాలు పనిముట్లు తీసుకోవాలనుకుంటే ట్రాక్టర్ కు సంబంధించిన ఆర్సి తమ వెంట తీసుకురావాలని దేహేగాం మండలం కొత్మీర్ క్లస్టర్ ఏఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి

కొనుగోలు కేంద్రాల హెచ్ఓడీలకు అదనపు కలెక్టర్ వి.రాములు ఆదేశాలు



మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావు గా నిర్వహించేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల హెచ్ఓడీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం హెచ్ఓడీ ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలను తప్పని సరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.పీసీఎస్ఏపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నిర్దేశించిన 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాల నమోదును త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, డీపీఎం, మెప్మా పీడీ, ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారి, డీసీఎంఎస్ మేనేజర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 15న రైతు సంఘం బహిరంగ సభ

రైతులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలిరావాలి

మహాసభ పోస్టర్లు విడుదల చేసిన ఏఐకేఎస్ నాయకులు

ఆసిఫాబాద్ , నవంబర్ 12 ప్రజా జ్యోతి అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 15న నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను గురువారం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు జాడి తిరుపతి మాట్లాడుతూ.. నవంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగ సంక్షోభం, రైతుల హక్కులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందించాలని, వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ



కల్పించడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని, మహిళా రైతులకు గుర్తింపు, హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, లక్ష్మి, కమల, ఇంద్ర, రవీంద్ర, నిఖిల్, వికృ, విశాల్, నానాజీ, పరదేశి పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తంతో మరోసారి సత్ఫలితాలు

సివిల్స్ తుది ఇంటర్వ్యూకు తెలంగాణ నుంచి 31 మంది ఎంపిక

ఇంటర్వ్యూకు ఎంపికైన ఒక్కొక్కరికి మరో రూ.లక్ష ప్రోత్సాహకం..

అభ్యర్థులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం మరోసారి సత్ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు.

158 మందికి రూ.1.58 కోట్ల ప్రోత్సాహకం

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన తెలంగాణ అభ్యర్థులకు సింగరేణి సంస్థ రెండు నెలల క్రితం ఆర్థిక ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. అర్హత సాధించిన 158 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ ఆర్థిక సహకారంతో మెయిన్స్ పరీక్షలకు సిద్ధమైన వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు అర్హత సాధించడం విశేషం.

ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష

తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మరోసారి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని త్వరలో అందించనుంది. ఈ సందర్భంగా అభ్యర్థుల విజయంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ, వారందరికీ అభినందనలు తెలిపారు. తుది ఇంటర్వ్యూలోనూ విజయం సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇప్పటికే 27 మందికి సివిల్స్‌లో విజయం

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ గత రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20 మంది చొప్పున ఇప్పటివరకు మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని సింగరేణి



చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆకాంక్షించారు. అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, వాటి నిర్వహణకు కూడా సింగరేణి సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు.

వరంగల్ జిల్లా నుంచి ఆరుగురు ఎంపిక

తుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మందిలో వరంగల్ జిల్లా నుంచి అత్యధికంగా ఆరుగురు ఉన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి ముగ్గురేసి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున ఎంపికయ్యారు. ఆదిలాబాద్, నారాయణపేట, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున అర్హత సాధించారు.సామాజిక వర్గాల వారీగా చూస్తే 18 మంది ఓబీసీ అభ్యర్థులు, ఇద్దరు ఎస్టీలు, ముగ్గురు ఎస్సీలు, ఎనిమిది మంది జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఉన్నారు. తెలంగాణ యువతకు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఆర్థిక చేయూతనందిస్తున్న ఈ పథకం మరోసారి తన ప్రాధాన్యతను చాటుకుంది.

హమాలీ కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు దిశగా కీలక అడుగు

కార్మిక సంఘాల నాయకులతో మంత్రి డా. వివేక్ వెంకటస్వామి సమావేశం



మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని హమాలీ కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి కీలక సమావేశం నిర్వహించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సంబంధిత శాఖల అధికారులు, హమాలీ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, కష్టపడి పనిచేసే కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.హమాలీ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు, వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. కార్మిక సంఘాలు చేస్తున్న న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.హమాలీ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావడంలో బోర్డు ఏర్పాటు కీలకంగా మారనుంది.

పిల్లల్లో న్యుమోనియా నివారణ పై అవగాహన



నేరడిగొండ నవంబర్ 12 (ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎస్ ఏ ఏ యన్ ఎస్ 2026-27 కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లల్లో న్యుమోనియా నివారణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ సద్దాం అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా పీహెచ్‌సీలో గర్భిణులకు ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్లు ఏ.సంతోష్, బి.స్వర్ణలత, ఆశా కార్యకర్తలు గీత, రజిని, జయమ్మ, పూలాబాయి, గర్భిణులు పాల్గొన్నారు.

పురాణాల్లో నాగుల మహిమ.. నాగదేవతల ఆరాధనలో ఆధ్యాత్మిక అంతరార్థం

నేడు (నవంబర్ 13న) నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక కథనం

విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్

మంచిర్యాల, 12, నవంబర్(ప్రజాజ్యోతి): తెలుగు సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం కార్తీక మాసంలోని శుక్ల పక్ష చతుర్థి (కార్తీక శుద్ధ చవితి) రోజున నాగుల చవితి పండుగను జరుపుకుంటారు. సాధారణంగా దీపావళి అమావాస్య తర్వాత నాలుగో రోజున వచ్చే ఈ పర్వదినాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ప్రకృతిలోని ప్రతి జీవిలో దైవత్వాన్ని దర్శించే భారతీయ సంస్కృతి పాములను సైతం నాగదేవతలుగా పూజిస్తోంది. నాగుల చవితి వెనుక కేవలం ఆచార వ్యవహారాలు మాత్రమే కాకుండా, పురాణ ఇతిహాసాల్లో చెప్పబడిన అనేక గాథలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, ధార్మిక సందేశాలు ఉన్నాయి. పురాణ కథనాల ప్రకారం ప్రజాపతి దక్షుని కుమార్తెలలో కద్రువు, వినత ముఖ్యులు. వీరు మహర్షి కశ్యపుని భార్యలు. కద్రువు ద్వారా నాగజాతి, వినత ద్వారా గరుత్మంతుడు జన్మించినట్లు మహాభారతంలోని ఆదిపర్వం, పురాణాలు వివరిస్తాయి. ఆదిశేషుడు, వాసుకి, తక్షకుడు, కర్కోటకుడు, పద్ముడు, మహాపద్ముడు వంటి నాగరాజులు ప్రసిద్ధి చెందారు. పురాణాల్లో ఆదిశేషుడికి అత్యున్నత స్థానం ఉంది. వెయ్యి పడగలతో విరాజిల్లే ఆదిశేషునిపై శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శయనిస్తాడని పురాణాలు వర్ణిస్తాయి. అందుకే ఆదిశేషుడిని అనంతుడు అని కూడా పిలుస్తారు. భగవంతుని సేవలో నిరంతరం ఉండే ఆదిశేషుడు భక్తి, విధేయత, సహనానికి ప్రతీకగా నిలుస్తాడు.పరమశివుని అలంకారాల్లో నాగాభరణం అత్యంత విశిష్టమైనది. శివుడి మెడలో చుట్టుకుని ఉండే నాగరాజు కాలానికి, మరణానికి, భయానికి ప్రతీకగా భావిస్తారు. సకల భయాలను జయించిన పరమశివుడు నాగాన్ని తన ఆభరణంగా ధరించడం ద్వారా భయంపై విజయం సాధించిన తత్వాన్ని తెలియజేస్తాడని ఆధ్యాత్మిక వ్యాఖ్యానాలు చెబుతాయి. దేవతలు, రాక్షసులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించాలని నిర్ణయించుకున్నప్పుడు మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి నాగరాజును తాడుగా ఉపయోగించారు. ఈ మహత్తర కార్యంలో వాసుకి కీలక పాత్ర పోషించాడు. సముద్ర మథనం ద్వారా అమృతంతో పాటు అనేక దివ్య వస్తువులు ఆవిర్భవించాయి. మహాభారతంలోని ఆదిపర్వంలో జనమేజయుడి సర్పయాగం గురించి విస్తృతంగా వివరించారు. పరీక్షిత్తు మహారాజు తక్షకుడి కాటుతో మరణించిన తరువాత, అతని కుమారుడు జనమేజయుడు నాగజాతిపై ప్రతీకారం తీర్చుకోవడానికి సర్పయాగం ప్రారంభించాడు. ఆ యాగంలో అనేక సర్పాలు అగ్నిలో పడిపోతుండగా, ఆస్తీక మహర్షి అక్కడికి వచ్చి తన జ్ఞానంతో జనమేజయుడిని శాంతింపజేసి సర్పయాగాన్ని ఆపించాడు. తద్వారా నాగజాతిని వినాశనం నుంచి రక్షించాడని తెలిపారు.యమునా నదిలో నివసించే కాళీయుడు తన విషంతో నదీ జలాలను కలుషితం చేశాడు. ప్రజలు, పశువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీకృష్ణుడు యమునలోకి ప్రవేశించి కాళీయుడి పడగలపై నృత్యం చేసి అతని గర్వాన్ని అణచివేశాడు. అనంతరం కాళీయుడిని యమునా నదిని విడిచి వెళ్లమని ఆదేశించి, అతని భార్యలు చేసిన ప్రార్థనను మన్నించి ప్రాణదానం చేశాడు. ఈ ఘట్టం అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు నాగుల చవితి వంటి పర్వదినాల్లో నాగదేవతలను ఆరాధించడం ద్వారా కుటుంబ క్షేమం, సంతాన సౌభాగ్యం, ఆరోగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. నాగారాధన ప్రకృతి పట్ల గౌరవం, సమస్త జీవరాశుల పట్ల కరుణ, జీవవైవిధ్య పరిరక్షణ వంటి విలువలను కూడా మనకు గుర్తుచేస్తుందని మొత్తంగా నాగుల చవితి పండుగ భారతీయ పురాణ సంప్రదాయానికి, ప్రకృతి ఆరాధనకు, జీవకారుణ్య భావనకు ప్రతీకగా నిలుస్తుంది. నాగదేవతల మహిమను స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో ఈ పర్వదినాన్ని జరుపుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే ఒక మంచి సందర్భం అని ఆయన వివరించారు.



పోలీస్ వాహనాల పనితీరుపై సీపీ ఆకస్మిక పరిశీలన







ప్రతి వాహనంలో రైట్ గేర్ తప్పనిసరి.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉత్తమ పనితీరు కనబరిచే ఐదుగురు డ్రైవర్లకు పురస్కారాలు

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి):మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ప్రత్యేకంగా పరిశీలించారు. పోలీస్ వాహనాలను స్వయంగా తనిఖీ చేసి వాటి ప్రస్తుత పరిస్థితి, పనితీరు, నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్ విధుల్లో వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని, అత్యవసర సమయాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా వాటిని ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచాలని సీపీ సూచించారు. వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాల్లోని వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ, సమాచార ప్రసార పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, మైక్ వ్యవస్థ, అత్యవసర లైట్లు, తాళ్లు, ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు, హెల్మెట్లు, లాఠీలు, శరీర రక్షణ కవచాలు, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తదితర అత్యవసర సామగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి వాహనంలో అవసరమైన రైట్ గేర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వాహనాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ

వాహనాల్లో ఏర్పడే లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీ సూచించారు. ఇంజిన్ ఆయిల్, టైర్లు, బ్రేకులు, లైట్లు, బ్యాటరీ తదితర యాంత్రిక పరికరాల పనితీరును నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. చిన్నపాటి లోపాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

ఉత్తమ డ్రైవర్లకు ప్రోత్సాహకాలు

వాహనాలను మంచి స్థితిలో ఉంచుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించే డ్రైవర్లను ప్రోత్సహించాలని సీపీ సూచించారు. డ్రైవింగ్‌లో క్రమశిక్షణ, అప్రమత్తత, బాధ్యత, వాహనాల సంరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ పనితీరు కనబరిచే ఐదుగురు డ్రైవర్లను గుర్తించి పురస్కారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా అధికారులు, డ్రైవర్లు సమన్వయంతో పనిచేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం చేయాలి

పోలీస్ అధికారులకు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశం

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): నేరాల నియంత్రణలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఘటనపై తక్షణమే స్పందించాలని, ముందస్తు సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకొని నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, అక్రమ కార్యకలాపాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, పెండింగ్ కేసులు, నేర పరిశోధన, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలు, పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, చార్జిషీట్ల దాఖలు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల పరిస్థితిని సమీక్షించారు.

ప్రతి ఘటనపై తక్షణ స్పందన అవసరం

పోలీస్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సీపీ సూచించారు. తమ పరిధిలో జరిగే ప్రతి ముఖ్యమైన ఘటనపై పూర్తి సమాచారం కలిగి ఉండటంతో పాటు, ఉన్నతాధికారుల నుంచి వచ్చే సమాచారంపై వెంటనే స్పందించాలన్నారు. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించే పరిస్థితి రాకుండా ముందస్తు అంచనా, సమన్వయం, సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తమ పరిధిలోని శాంతిభద్రతలు, సున్నితమైన ప్రాంతాలు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, సమస్యాత్మక వ్యక్తులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజకీయ, ఇతర అనుబంధాలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా వారి కార్యకలాపాలను పరిశీలించాలని ఆదేశించారు. దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలు, దాడులు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన



చోట ఆకస్మిక తనిఖీలు, కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారి కదలికలను పర్యవేక్షించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి

పర్యవేక్షణ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా పగలు, రాత్రి వేళల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలని సీపీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల రోజువారీ పనితీరు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల పరిస్థితిని నిరంతరం సమీక్షించాలన్నారు. సమస్య తలెత్తిన తర్వాత బాధ్యత నుంచి తప్పించుకోవడం కాకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని స్పష్టం చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, దర్యాప్తులో నాణ్యత పెంచాలని సూచించారు. నిందితుల అరెస్టు, సాక్ష్యాధారాల సేకరణ, సాంకేతిక ఆధారాల వినియోగం, చార్జిషీట్ల దాఖలులో జాప్యం ఉండకూడదన్నారు. కోర్టుల్లో నేర నిరూపణకు అవసరమైన పటిష్టమైన ఆధారాలను సేకరించాలని దర్యాప్తు అధికారులకు సూచించారు

మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఈ-పెట్టీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల నమోదుతో పాటు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.ఎన్‌డీపీఎస్ కేసుల్లో తక్కువ పరిమాణంలో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలు పట్టుబడినా



కేసు నమోదు చేసి, వాటి వెనుక ఉన్న సరఫరాదారులు, మధ్యవర్తులు, వినియోగదారుల నెట్‌వర్క్‌పై లోతైన దర్యాప్తు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో సంబంధాలున్న నిందితులను గుర్తించి అక్కడి పోలీసుల సమన్వయంతో చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పేకాట, రేషన్ బియ్యం, పశువులు, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. చిన్నపాటి చట్ట ఉల్లంఘనలను సైతం నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సమస్యలను ముందుగానే గుర్తించాలి

పోలీస్ అధికారులు కేవలం క్షేత్రస్థాయిలో పర్యటించడమే కాకుండా అక్కడి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే ఆలోచనా విధానం, బాధ్యతాయుతమైన పనితీరు, సమర్థవంతమైన పర్యవేక్షణ కలిగి ఉండాలని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ రంగారెడ్డి, ఏఆర్ ఏసీపీ రమేష్‌తో పాటు పలువురు సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వారపు సంతలో వసూళ్ల పర్వం!

రశీదులు లేకుండానే ఒక్కొక్కరి నుంచి రూ.70 వసూలు

కనీస సౌకర్యాలు కరువు.. పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్ నవంబర్ 12 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలో చిరు వ్యాపారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సంతకు వచ్చే వ్యాపారుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.70 చొప్పున వసూలు చేస్తున్నప్పటికీ ఎలాంటి రశీదులు జారీ చేయడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ వసూళ్లకు అధికారిక అనుమతులు ఉన్నాయా? వసూలు చేస్తున్న నగదు ఎవరికి చేరుతోంది? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

సౌకర్యాలు లేవు.. వసూళ్లు మాత్రం తప్పవా?

వివిధ గ్రామాల నుంచి సంతకు వచ్చే చిరు వ్యాపారులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సరైన షెడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు లేకపోవడంతో ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నామని వాపోతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన కొద్దిపాటి ఆదాయంలోనూ రూ.70 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగంగా వసూళ్లు.. అధికారుల మౌనం!

వారపు సంతలో ఓ వ్యక్తి బహిరంగంగా వ్యాపారుల నుంచి నగదు వసూలు చేస్తున్న దృశ్యాలు మీడియా దృష్టికి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి వారం ఎంతమంది వ్యాపారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు? వసూలైన మొత్తానికి అధికారిక లెక్కలు ఉన్నాయా? పంచాయతీ ఖాతాలో జమ చేస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేపట్టాలని డిమాండ్

జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవో, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వాంకిడి వారపు సంతలో జరుగుతున్న వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని చిరు వ్యాపారులు



కోరుతున్నారు. వసూళ్లకు సంబంధించిన అనుమతులు, రుసుముల వివరాలను వెల్లడించాలని, ప్రతి రూపాయికి అధికారిక రశీదు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే సంతలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వసూళ్ల వ్యవహారంపై స్పష్టత ఇస్తారా? లేదా అనేది వేచి చూడాలి.

20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఉద్యోగుల పోరాటానికి తెలంగాణ రక్షణ సేన సంపూర్ణ సంఘీభావం

డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా గత 30 రోజులుగా కొనసాగుతున్న శాంతియుత ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళనకు తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల



హక్కుల సాధన కోసం వారు చేస్తున్న పోరాటానికి తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి తిప్పారపు సారయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి తిప్పారపు సారయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు హారిక రావు, మహిళా రాష్ట్ర నాయకురాలు నిషా, జిల్లా సంయుక్త కార్యదర్శులు రాచకొండ సురేష్, లెనిన్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి సంధ్య, జిల్లా అధికార ప్రతినిధి శ్రీవాణి, నాయకులు జహీర్ ఖాన్, రజిత, రాజశేఖర్, ప్రశాంత్, జ్యోతి, వసంత, కాసిపేట మండల అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలపై అవగాహన కల్పించేలా 'రైతుకు రక్షణ' లఘు చిత్రం





భూ సమస్యలకు కుటుంబ సభ్యుల పరస్పర అంగీకారమే పరిష్కారం

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): సమాజంలో నెలకొన్న భూ వివాదాలు, వాటి కారణంగా కుటుంబాల మధ్య తలెత్తుతున్న సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా 'రైతుకు రక్షణ' పేరుతో లఘు చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ఇతర అధికారులతో గురువారం కలిసి 'రైతుకు రక్షణ' లఘు చిత్రాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భూములకు సంబంధించిన వివాదాలు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా వారసత్వంగా సంక్రమించిన భూముల పంపిణీ విషయంలో కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్వహించిన భూ సర్వేల ఆధారంగా రూపొందించిన రెవెన్యూ రికార్డులే ఇప్పటికీ కొనసాగుతుండటంతో పలు సందర్భాల్లో భూ వివాదాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. భూములకు సంబంధించిన కేసులు న్యాయస్థానాల్లో అధికంగా ఉండటంతో పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. కుటుంబ సభ్యులందరూ పరస్పర అంగీకారంతో భూములను పంపిణీ చేసుకుంటే వివాదాలకు సులభంగా పరిష్కారం లభిస్తుందని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం లఘు చిత్ర దర్శకుడు నాగరాజు రూపొందించిన 'రైతుకు రక్షణ' చిత్రానికి సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. దర్శకుడు నాగరాజును శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, జైపూర్ మండల తహసీల్దార్ వనజారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అటవీ అనుమతులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్, నవంబర్ 12 ప్రజా జ్యోతి పర్యావరణం, వన్యప్రాణులను కాపాడుకుంటూనే అటవీ శాఖ అనుమతులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, స్వయం సహాయక సంఘాల భవనాలు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ శాఖ అనుమతులను సకాలంలో పొందాలని సూచించారు. అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.భూముల రీ సర్వే ప్రక్రియలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులకు సంబంధించి ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలగకుండా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మంద మకరంద్, డీఎఫ్‌వో బాలమణి, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మట్, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చిత్తరంజన్, సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆర్డీవో లోకేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీటీ ఉద్యోగులకు ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలి

క్వాలిటెక్ ఏజెన్సీని రద్దు చేయాలి.. వేతనాలు పెంచాలి

ఐసీటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల క్రిష్ణమాచారి



ఆసిఫాబాద్ నవంబర్ 12 ప్రజా జ్యోతి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఐసీటీ ఉద్యోగులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఐసీటీ ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చి నెలతో పాటు ఈ ఏడాది జూలై నుంచి అక్టోబర్ వరకు మొత్తం ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు అందక ఉద్యోగులు అప్పులపాలై కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ క్వాలిటెక్ సంస్థ అరకొర వేతనాలు చెల్లిస్తూ, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు.పెండింగ్ వేతనాలను ఒకేసారి చెల్లించాలని, క్వాలిటెక్ ఏజెన్సీపై విచారణ జరిపి వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేయాలని కోరారు. స్పందించిన అదనపు సంచాలకుడు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు క్రిష్ణమాచారి తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

డిసెంబర్ 15 నుంచి జరిగే సమ్మెకు నోటీసు అందజేత



మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డిసెంబర్ 15 నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును గురువారం మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే పీఆర్వో శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు బీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు.నవంబర్ 12వ తేదీ వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం డిసెంబర్ 15 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఆశా యూనియన్ సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, జిల్లా కమిటీ సభ్యురాలు పద్మ, నాయకులు సుజాత, పద్మ, కవిత, కృష్ణవేణి, రమ, వినోదరాణి, బీఆర్‌టీయూ ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వాణి, కోశాధికారి శ్రీలత, సంధ్య తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాతో కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా భరోసా

మృతుడి భార్యకు బీమా చెక్కు అందజేత..

ఖాతాదారులకు పలు ఆర్థిక సేవలు.



మందమర్రి , నవంబర్ 12(ప్రజాజ్యోతి) :బ్యాంకు ఖాతాదారులకు అందించే ప్రమాద బీమా సౌకర్యం ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. ఈ క్రమంలో గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ ఖాతాదారుడు నజీర్ మొహమ్మద్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, ఆయనకు ఉన్న గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతా ప్రమాద బీమా సౌకర్యం ద్వారా భార్య ఫాతిమా బీకి రూ.2 లక్షల పరిహారం అందజేశారు. మంచిర్యాల కార్పొరేటర్ మహమ్మద్ గౌసుద్దీన్ చేతుల మీదుగా బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతులకు ఏడాదికి 10.50 శాతం వడ్డీతో వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల పరిసర గ్రామాల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించి పెన్షనర్లు, ఇతర ఖాతాదారులకు తమ గ్రామాల్లోనే బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకునే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.బ్రాంచి మేనేజర్ కేలేటి ప్రవీణ్ మాట్లాడుతూ ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 24 గంటలూ ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో గ్రామకు గరిష్ఠంగా రూ.10 వేల వరకు రుణం అందిస్తున్నామని, వ్యాపారుల అభివృద్ధికి అవసరమైన రుణ సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. సేవింగ్స్ ఖాతాల ప్రారంభానికి అవసరమైన ఫొటోలు, జిరాక్స్‌లను బ్యాంకులో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టాఫీస్ డిపాజిట్లపై కూడా 10 శాతం వార్షిక వడ్డీ రేటుతో రుణ సదుపాయం కల్పిస్తున్నామని, ఖాతాదారులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ అధికారి జి.సుధాకర్, ఆర్.రమేష్, జూనియర్ అధికారి ఇ.శివకుమార్ పాల్గొన్నారు.

చెంచు బాల బాలికల విద్యాభివృద్ధి కి అన్ని రకాల సహకరిస్తాం



ఖానాపూర్ 12(ప్రజా జ్యోతి) విద్య అభివృద్ధి కోసం చెంచు గిరిజన బాలబాలికలకు చేయూతనందించి అన్ని విధాల ఆదుకుంటామని ఉపాధ్యాయులు వాలుగోటి కిషన్ అన్నారు నిర్మల్ జిల్లా కడెం మండలం లోని లింగాపూర్ గ్రామ శివారు లోని చెంచు వాడ లో ఉన్న బాల బాలికలను కడెం మండలంలోని లింగాపూర్ జీవ శాస్త్రం ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ చెంచు బాల బాలికల్లో గల పోషకాహార లోపం ను గుర్తించి అందరికి పల్లిపట్టీలు ఇతర రకాల ఆరోగ్యకర తినుబండారాలను అందించారు. బాల బాలికల కు కావలసిన దుస్తులు తో పాటు విద్యా సామగ్రి ని అందజేస్తానని కిషన్ తెలిపారు. ఈ బాలబాలికలను వయస్సును బట్టి అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తానని కిషన్ తెలిపారు. గురువారం లింగాపూర్ శివారు లో గల చెంచుల ఇండ్లను సందర్శించి తల్లితండ్రులు బాల బాలికలకు చదువు కోవడం వలన మీలో పేదరికం ఉండదని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని, మీలాంటి పేద పిల్లలను బాగ చదివిస్తే మీ భవిష్యత్ మీ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని ఈ సందర్భంగా వాల్గోట్ కిషన్ అవగాహన కల్గించారు.

స్వర్గీయ పులాజి బాబా ఆధ్యాత్మిక మార్గం ఆదర్శనీయం

27 వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ వెల్లడి



ఖానాపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి) స్వర్గీయ ఆధ్యాత్మిక గురువు పూల జీ బాబా భక్తి మార్గం ఆదర్శనీయమని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జుపటేల్ అన్నారు గురువారం పులోజి బాబా 27వ వర్ధంతి సందర్భంగా పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అనేకమంది ప్రజల్ని భక్తి మార్గంలో నడిపించారని ఆయన అధ్యయన కేంద్రాలు ఉమ్మడి జిల్లాతో పాటు పలు రాష్ట్రాల్లో భక్తులు నెలకొల్పుకొని భక్తి మార్గంలో నడుస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు ఎల్ నోవా ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా కోరారు

నేడు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పర్యటన

రాత్రి ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో బస



ఖానాపూర్ నవంబర్ 12 (ప్రజాజ్యోతి) ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జపటేల్ కడెం మండలంలోని పలు కార్యక్రమాల్లో శుక్రవారం ఉదయం పర్యటిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు కడెం మండలం చిన్న బెల్లల్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం 11 గంటలకు కడెం మండల రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు పంపిణీ 11 గంటల 30 నిమిషాలకు న్యూ ధర్మాజీపేట ధర్మాజీపేట గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారని అలాగే మధ్యాహ్నం 12 గంటల 30 లకు నచనల్లాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు తదుపరి 1 గంట 30 నిమిషాలకు మాసాయిపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ అనంతరం దిల్దార్ నగర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి అనంతరం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో రాత్రి బస చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి ముందస్తు సమాచారం అధికారులు, పోలీసులు, విలేకరులు, కాంగ్రెస్ కార్యకర్తల అభిమానుల నిమిత్తం తెలియజేస్తున్నామన్నారు

వేసవి విద్యుత్ డిమాండ్‌కు ముందస్తు చర్యలు చేపట్టాలి

ఓవర్‌లోడ్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాలి

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేయాలి



ఆసిఫాబాద్, నవంబర్ 12 ప్రజా జ్యోతి రాబోయే వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. గురువారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ), విద్యుత్ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్వో) భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వచ్చే వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున విద్యుత్ అవసరాలకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓవర్‌లోడ్‌కు గురవుతున్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ముందుగానే గుర్తించి అవసర మైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రత్యేక లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. అన్‌మ్యాన్డ్ వర్కర్లకు రూ.10 లక్షల గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడంపై యూనియన్ నాయకులు సీఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. ఖాళీ పోస్టుల భర్తీకి ఆయన సానుకూలంగా స్పందించారు. విద్యుత్ సరఫరా, తక్కువ వోల్టేజీ సమస్యలు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, ఏడీఈలు, ఏఈలు, యూనియన్ నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

పూలాజీ బాబా ధ్యాన మందిరం 27వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మామిడి గూడలో నూతన వివో భవనానికి పూజ



ఇంద్రవెల్లి, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం అంజి గ్రామ పం చాయతీ పరిధిలోని మామి డిగూడ గ్రామంలో గురువా రం నూతన వీవో భవన ని ర్మాణానికి ఖానాపూర్ ఎమ్మె ల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూ మిపూజ చేశారు.అనంతరం పూలాజీ బాబా ధ్యాన మం దిరం 27వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని, పూలా జీ బాబా చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వ హించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలాజీ బాబా గారంటే తనకు ఎంతో అభిమానం అని, ఆ యన బోధించిన ఆధ్యాత్మిక మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శ మని తెలిపారు. అలాగే ఎల్ నినో ప్రభావంతో వర్షాలు త గ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగిం చుకోవాలని, జల సంరక్షణ లో భాగంగా ఇంకుడు గుం తలు ఏర్పాటు చేసుకోవాల ని సూచించారు.ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజా ప్రతిని ధులు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వర స్వామిబ్రహ్మోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే రేఖకు ఆహ్వానం



ఖానాపూర్ నవంబర్ 12(ప్రజా జ్యోతి) ఖానాపూర్ పట్టణంలోని శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలకు మాజీ శాసన సభ్యురాలు అజ్మీర రేఖకు ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది 42 వ సంవత్సరపు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించే దశలో స్వామివారి కల్యాణోత్సవానికి రావలసిందిగా ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న కార్యదర్శి నిమ్మల రమేష్ నడిబట్ల రమేష్ రామ్ భీమన్న రామ్ లక్ష్మణ్ తుమ్మనపల్లి లక్ష్మణ్ సుధాకర్ తదితరులుమాజీ ఎమ్మెల్యే ఇంటిలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు

ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి మండలంలో 883 నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ





ఇంద్రవెల్లి, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) పేద ప్రజల సంక్షేమమే ప్ర జా ప్రభుత్వ లక్ష్యమని ఖా నాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొ జ్జు పటేల్ స్పష్టం చేశారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామా లకు చెందిన 883 మంది ల బ్ధిదారులకు నూతన చే యూత పెన్షన్ మంజూరు పత్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ మే లక్ష్యంగా పనిచేస్తోందని, ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూ స్తున్న పేదలకు అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన రేషన్ కార్డులు అందించామని, ఖానా పూర్ నియోజకవర్గంలోనే అత్యధి కంగా రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా దశలవారీగా అర్హులందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు.ఎల్‌నినో ప్రభా వంతో రానున్న రోజుల్లోనీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున నీటిని వృథా చే యకుండా జలశ్రీ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల ని సూచించారు. గ్రామ సర్పంచులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించి నీటి సమ స్యల పరిష్కారానికి తీసుకో వాల్సిన చర్యలపై చర్చిస్తామని తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ ము కాడే ఉత్తమ్, ఎం ఆర్ ఓ , ఎంపీడీఓ, ఇంద్రవెల్లి మండల వివిధ గ్రామాల సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ కోర్టుకు రెగ్యులర్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి నిఖిత కు న్యాయవాదుల సాదర స్వాగతం



ఖానాపూర్ నవంబర్ 12 (ప్రజా జ్యోతి) ఖానాపూర్ కోర్టు నూతన జూనియర్ రెగ్యులర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి నిఖిత ని ఖానాపూర్ బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాధారంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు జడ్జి నిఖిత కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఖానాపూర్ న్యాయస్థానంలో ఆమె సేవలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మట్టేరి రాజశేఖర్, ఏజీపీ ఆసిఫ్ అలీ, వెంకట్ మహేంద్ర, బాశెట్టి శివ, ప్రశాంత్ రెడ్డి, షబ్బీర్ పాషా, నరేంద్ర నాథ్, ఖదీర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో మాధవిలత





నేరడిగొండ, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారిణి డి. మాధవిలత గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని ఎంపీపీఎస్ కొరటికల్, లింగట్ల జడ్పీహెచ్ఎస్‌తో పాటు వాంకిడి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యాబోధన తీరును, తరగతి గదులను పరిశీలించిన డీఈవో.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా మరియు పౌష్టికాహార విలువలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా విధులు నిర్వహించాలని, విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భూమారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) గ్రామీణ ప్రాంతాలలో ఆది వాసి గిరిజనులు ఎదుర్కొం టున్న సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. బుదవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తలమడుగు మండల కమిటీ ఆధ్వర్యంలో తలమడుగు మండలంలోని దేవాపూర్,బరంపూర్, చర్లపల్లి, ఝరి, రత్నాపూర్, గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి గ్రామాల సమ స్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 80 సంవత్సరాలు గడిచిన ఇప్పటికి ఆదివాసి గ్రామా లకు సరిఅయిన రోడ్డు సౌక ర్యం కల్పించకపోవడంచాలా విచారకరం అని,ఇప్పటి కైన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి దేవపూర్ చెక్ పో స్ట్ నుండి పునాగూడ వరకు, ఝరి నుండీ రత్నాపూర్ రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తలమ డుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో గోడం గణేష్ రాష్ట్ర అధ్యక్షులుతో పాటు వెట్టి మనోజ్ రాష్ట్ర సంయుక్త కా ర్యదర్శి, అర్కా శేషారావు రాష్ట్ర కార్యదర్శి,కుముర జ్ఞా నేష్ జిల్లా ఉపాధ్యక్షులు, ఆత్రం భరత్ జిల్లా ఉపాధ్య క్షులు,జంగల పోచన్న మండల అధ్యక్షులు,గోడం బుజంగారవు వర్కింగ్ ప్రెసిడెంట్, పెందుర్ మాధవరావు రైతు సంఘం అధ్యక్షులు, అనక రాంజీ ఉపాధ్యక్షులు ఆత్రం సూర్యబాన్ సర్పంచ్, ఆత్రం అశోక్ సర్పంచ్, తొడ సంహే మంత్ మాజీ సర్పంచ్, పెందుర్ జైతు పటేల్, మెస్రం నాగోరావ్ పటేల్,నైతం బాజేరావు పటేల్,పెం దుర్ మాధవరావు ఆత్రం సీతా రాం, పేందూరు శంభు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఘనంగా భాయ్ దూజ్ దీపావళి వేడుకలు



ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) అదిలాబాద్ పట్టణంలోని ఈ శ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రంలో భాయ్ దూజ్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ దీపాలు వెలిగించి వేడుకలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ భార తీయ సంస్కృతి, సంప్రదా యాలకు దీపావళి పండుగ ప్రత్యేకమైన గుర్తింపు అని, భాయ్ దూజ్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు, ఆప్యాయత, ఆత్మీయ తకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవి తాల్లో ప్రేమ, శాంతి, సంతోషం, సౌభాగ్యం నిండాలని ఆకాంక్షించారు. ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సంస్థ సమాజంలో ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సోద రభావం పెంపొందించేందు కు చేస్తున్న సేవలు అభినం దనీయమని కొనియాడారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్ర మాలు ప్రజల్లో సానుకూల ఆలోచనలు, మానవీయ విలువలను పెంపొందిస్తాయ ని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన విజయలక్ష్మి అక్కయ్య, రేవతి అక్కయ్య, దేవదాస్ దేశ్ పాండే, బ్రహ్మకుమారీస్ స భ్యులు తదితరులు పాల్గొ న్నారు.

డా. సలీం అలీ 130వ జయంతి సందర్భంగా విద్యార్థులకు పక్షులపై అవగాహన



జన్నారం,నవంబర్12(ప్రజాజ్యోతి) భారతదేశ బర్డ్ మ్యాన్, ఫాదర్ ఆఫ్ ఆర్నిథాలజిస్ట్ డా. సలీం అలీ 130వ జయంతి సందర్భంగా జన్నారం ఎఫ్.డి.ఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో గురువారం జూనియర్ కళాశాల విద్యార్థులకు జన్నారం రేంజ్ బైసన్ కుంట వద్ద పక్షులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ విద్యార్థులకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో ఉన్న వివిధ రకాల పక్షుల గురించి వివరించారు. పర్యావరణ సమతుల్యతలో పక్షుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ ఆవశ్యకత గురించి తెలిపారు.డా. సలీం అలీ భారతదేశంలో పక్షుల గురించి అధ్యయనం చేసిన మొదటి పరిశోధకులని, తన పరిశోధన సమయంలో బైనాక్యులర్ వంటి ఆధునిక పరికరాలు లేకుండా కేవలం తన కంటి చూపుతోనే దేశమంతా తిరిగి పక్షులపై అధ్యయనం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్.ఆర్.ఓ బాబా ఖాదర్ వళి, డిఆర్ఓ మమత, జూనియర్ కళాశాల అధ్యాపకులు కరుణాకర్, స్వరూప, హిటికాస్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ అనగందుల వెంకట్, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఆసరా అందించడమే లక్ష్యంగా ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీ

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్, నవంబర్ 12 (ప్రజాజ్యోతి) పేద, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్ ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు గురువారం బోథ్ మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్ మండలానికి చెందిన వివిధ గ్రామాల 552 మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ కార్డుల ప్రొసీడింగ్స్‌ను అనిల్ జాదవ్ అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం ముఖ్యమని, ఆసరా పెన్షన్ ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి,బోథ్ సర్పంచ్, కుర్మే అన్నపూర్ణ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు ఎన్‌హెచ్‌ఎం జేఏసీ వినతి



ఆసిఫాబాద్ నవంబర్ 12 ప్రజా జ్యోతి వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. గురువారం ఆసిఫాబాద్‌లోని డీసీసీ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారని తెలిపారు. తెలంగాణలోనూ తమ సేవలను గుర్తించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆత్రం సుగుణక్క హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ హరిత



ఆసిఫాబాద్ నవంబర్ 12 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న సదరం సహాయ శిబిరాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిత సూచించారు. దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అయితే స్లాట్లు బుక్ చేసుకున్నా చాలా మంది లబ్ధిదారులు శిబిరాలకు హాజరుకాకపోవడం వల్ల అధికారుల సమయం, ప్రభుత్వ వనరులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకరోజు 270 స్లాట్లు కేటాయిస్తే కేవలం 90 మంది మాత్రమే వచ్చారని పేర్కొన్నారు. రవాణా ఇబ్బందులు ఉంటే ప్రయాణ ఖర్చులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిని శిబిరాలకు తీసుకురావాలని కోరారు. అర్హులైన వారు ఎవరూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, సకాలంలో సదరం ధ్రువీకరణ పత్రం పొంది ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేషనల్ హెల్త్ మిషన్ కాంటాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరి ష్కరించండి

రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, వేతన సంబంధిత సమస్యలు పరిష్కరించలేరా?

ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకటనారాయణ

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) తమ సమస్యలు పరిష్క రించాలని అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ ఓ కార్యాలయం ఎదుట గత కొన్ని రోజులుగా రిలే నిరా హార దీక్షలు చేస్తున్న ఎన్ ఎం హెచ్ ఉద్యోగుల సమ స్యలు తక్షణమే పరిష్కరిం చాలని ఐఎఫ్టియు జిల్లా ప్ర ధాన కార్యదర్శి బి వెంకట్ నారాయణ డిమాండ్ చేశా రు.2026 అక్టోబర్ 13 నుండి నేషనల్ హెల్త్ మిషన్ (ఎ న్ హెచ్ ఎం) లో పనిచేస్తున్న 17,541 మంది కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన సమ స్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక స మ్మె చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమా త్రం పట్టించుకోకుండా మొం డిగా, నిర్లక్ష్యంగా ఉండడాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టియు) తీ వ్రంగా నిరసిస్తుందని ఐ ఎఫ్ టి యు ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకట నారాయణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ లోని డిఎండహెచ్ ఓకార్యాలయం ముందు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఐఎఫ్ టి యు, ఏ ఐకెఎంఎస్, పి డిఎస్ యు జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలియజేసాయి. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకట్ నారాయణ, ఏఐ కె ఎం ఎస్ రాష్ట్ర సహాయకా ర్యదర్శి కే సాయన్న, పిడి ఎ స్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ లు మా ట్లాడుతూ, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, కనీస వేతన సంబంధిత సమస్యలను ప రిష్కరించలేని ప్రభుత్వాలు ఈ దేశంలో, రాష్ట్రంలో పాలనను కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు.గత రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ అవు ట్సోర్సింగ్ విధానంలో పనిచే స్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యో గులు కోరుతున్నది రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధ హ క్కులు, సౌకర్యాలనే వారు కోరుతున్నారని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఉద్యోగులు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వారి సర్వీ



సులను క్రమబద్ధీకరించ లే దని, వేతనాలు సక్రమంగా, సకాలంలో ఇవ్వడం లేదని, 100% గ్రాస్ జీతం లేదని, ఆరోగ్య భీమా, జీవిత బీ మా సౌకర్యం లేదని, రిటై ర్మెంట్ బెనిఫిట్స్ లేవని, చట్ట ప్రకారం గ్రావిటీ, పెన్షన్స్ సౌక ర్యం లేదని,కనుక రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు, బాధ్యతలు నిర్వ హిస్తున్నప్పటికీ తమకు స మాన వేతనము, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెల వులతో పాటు అవసరమైన ఇతర ఉద్యోగ భద్రత, సంక్షే మ సౌకర్యాలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరు తున్నప్పటికీ ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించ డం బాధాకరమని అన్నారు. పెరుగుతున్న నిత్యవసర స రుకుల ధరలు, విద్య, వై ద్యం తదితర ఖర్చులు నిత్యం పెరుగుతున్న స్థితిలో, చాలీచాలని వేతనాలతో జీ వితాలను గడుపుతున్న ఎ న్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిత్యం అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి బ్యాంకులు వ్యక్తిగత గృహ రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తు న్నాయని, వాస్తవానికి శాశ్వత పని స్థలాల్లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమంగా వారి ఉద్యోగాలను క్రమబద్ధీకర ణ చేసి "కాంట్రాక్ట్ అబాల్షన్ యాక్ట్– 1976" ప్రకారం ఈ విధానా న్ని రద్దు చేయవలసి ఉంటుందని, చ ట్టం వచ్చిన తర్వాత పాల కులు అటువైపు ఒక్క అడుగు కూడా వేయలేదని విమర్శించారు ఇక



సమాన పనికి సమాన వేతనం ఇ వ్వాలని భారత రాజ్యాం గంలోని ఆర్టికల్ 39(డి) నిర్దే శిస్తుందని, అంతే కాదు స మాన పనికి సమాన వేత నం ఇవ్వాలని 1964 నుండి 2016 అక్టోబర్ 26 వరకు సుప్రీంకోర్టుతో సహా వివిధ రాష్ట్ర హైకోర్టులు సుమారు 64 రకాల తీర్పులు ఇచ్చాయని అయినా పాలకులు పట్టించుకోకపోవడం ఎంత దుర్మార్గమో కార్మిక వర్గం, ఉద్యోగులు అర్థం చేసుకో వాలని, బీ జే పీ,కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరే కంగా బలమైన కార్మికోద్య మాన్ని నిర్మించాలని పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఐఎఫ్ టి యు జిల్లా నా యకులు గౌరాల సుభాష్, పి డి ఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తాత్రి, ఎన్ హెచ్ ఎం ఉద్యోగ సం ఘాల జె ఎసి నాయకులు, ఉద్యోగులు తదితరులు పా ల్గొన్నారు.

డిఎండహెచ్ ఓ డాక్టర్ రాథోడ్ నరేందర్ తండ్రి మృతి పట్ల సంతాపం

తెలిపి నివాళులర్పించిన మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, దుర్గం శేఖర్

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12, (ప్రజా జ్యోతి)గతంలో ఆదిలాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా సేవలందించి, ప్రస్తుతం మంచిర్యాల జిల్లా డిఎం హెచ్ ఓగా విధులు నిర్వహి స్తున్న డాక్టర్ రాథోడ్ నరేందర్ తండ్రి రాథోడ్ శంకర్ దుర్రాజీ మరణించడం బాధా క రమని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, ఆదిలా బాద్ పార్లమెంట్ ఎస్సీ డిపా ర్ట్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి దుర్గం శేఖర్ అన్నారు.ఈ సందర్భంగా బుదవారం నిర్వహించిన పెద్దకర్మ (తెరవి) కార్యక్రమానికి హాజరై రాథోడ్ శంకర్ దుర్రాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం డాక్టర్ రాథో డ్ నరేందర్ కుటుంబ సభ్యు లను పరామర్శించి తమ ప్ర గాఢ సానుభూతిని తెలియ జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దల మ రణం కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ



కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా కో ఆర్డినేటర్ మేకల జితేందర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డాక్టర్ అశోక్, డాక్టర్ నరేందర్ బండారి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ గణేశ్, వెం కట్రావు, భీమ్రావు, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీరామ్, ఉత్తం ఎంపీటీసీ రవీందర్ భా రత్ చౌహాన్, శ్రీరామ్ నాయ క్, రాంకిషన్ నాయక్,



ఆడే సురేష్,బాబు లాల్, మాదోస్తు మహేందర్, ఆడే రఘు తదితరులు పాల్గొన్నారు.

కొలిపుర చెరువు సుందరీకరణ

ఇళ్ల తొలగింపుకు నోటీసులు

బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్







ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ (కొలిపుర)కా లనీలో చెరువు సుందరీకర ణకు స్థానిక మున్సిపల్ అధి కారులు శ్రీకారం చుట్టారు. ఈ పనుల నేపథ్యంలో చెరువు పక్కన నివాసం ఉంటున్న 122 ఇళ్ల యజమానులకు ఇళ్లను ఖాళీ చేసి తొల గించాలంటూ సంబంధిత అ ధికారులు నోటీసులు జారీ చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు డా.నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజీద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీగంద్రత్ సుజాత, కొలిపుర కాలనీ ని సందర్శించి, కాలనీలో పర్యటిస్తూ నోటీసులు అందుకున్న బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్న తమకు ఇళ్ల తొలగింపు నోటీ సులు రావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని స్థానికులు తమ ఆవేదనను డానరేష్ జాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ బాధి తుల సమస్యలను, వారి ఇబ్బందులను సావధానంగా విన్నారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా, ఇ బ్బందులు కలగకుండా సమస్యను సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, బాధితులకు అండగా నిలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్ల ప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కిజార్ పాషా, టౌన్ జనరల్ సెక్రటరీ మహేందర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకే ప్రాధాన్యత

భీంసరిగ్రామాభివృద్ధికి రూ.70 లక్షల నిధులు

మూడు కీలక భవనాలకు భూమిపూజ

రూ.30 లక్షలతో పాఠశాల భవనం.. రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, మరో రూ.20 లక్షలతో సమైక్య భవనం

రూ.4.30 కోట్లతో వాగుపై బ్రిడ్జి నిర్మాణం

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొ న్నారు. అదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రా మంలో బుదవారం పలు అభివృద్ధి పనులను గ్రామ పంచాయతీ భవనం, మహి ళా భవనం, ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదులు స్థానిక సర్పంచ్ తో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో గ్రామపంచా యతీ భవనం లేకపోవడంతో పాటు 54 డ్వాక్రా సంఘాలకు సమైక్య భవనం లేకపోవడంతో గత మూడు, నాలుగు సంవత్సరాలు గా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోనే కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. పాఠశాల భవన ని ర్మాణం అర్ధాంతరంగా నిలి చిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి రూ.30 లక్షలతో పాఠశాల భవనం, రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, మరో రూ.20 లక్షలతో గ్రా మ సమైక్య భవన నిర్మాణా నికి నిధులు మంజూరు చే యించి భూమిపూజ కార్యక్ర మం నిర్వహించినట్లు వెల్ల డించారు. ఎన్నికల సమయంలో గ్రామ రైతులు వాగు దాటి వెళ్లేందుకు పడుతు న్న ఇబ్బందులను గుర్తించా మని, వారి సమస్య పరిష్కా రానికి రూ.4.30 కోట్లతో బ్రి డ్జి నిర్మాణం చేపడుతున్నా మని తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడ మేతన లక్ష్యమని, రాజకీ యాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతు న్నామని స్పష్టం చేశారు. మరోవైపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణాలు పూర్తయితే జిల్లా రూపురేఖలు మారిపోతాయని, కనీసం 20 నుంచి 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశా లు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మంజూరైన రూ.70 లక్షల నిధులతో చేపట్టిన పనుల ను త్వరితగతిన పూర్తి చే యాలని అధికారులను ఆదే



శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కార్తీక్, మండల ఉపసర్పంచ్‌లు, స్థానిక నాయకులు, మయూర్ చంద్ర,దయాకర్, దత్తు,ఆశరెడ్డి, సత్యం, వెంకన్న, శ్రీకాంత్, గంట జీవన్, గంగాధర్, ప్ర భాకర్, గ్రామ సభ్యులు, అ ధికారులు తదితరులు పా ల్గొన్నారు.

ప్రతి కేసు లో నేరస్తులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు జరగాలి

విధులలో చురుకుతనం, నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి పోలీస్ యూనిఫామ్ సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెంచుతుంది

ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

దొంగతనాలు, ఆర్థిక నేరాలు జరగకుండా, రాయితీ బియ్యం తరలకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి పట్టణంలో నమోదైన ప్రతి ఒక్క కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలన

వార్షిక తనిఖీలలో భాగంగా ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) ప్రజలలో పోలీసు కీర్తి ప్రతి ష్టలు పెంచే విధంగా విధుల నిర్వహణ చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపి ఎస్ తెలిపారు. వార్షిక తని ఖీలలో భాగంగా గురువారం ఆదిలాబాద్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నుజిల్లా ఎస్పీ పరిశీలించారు . మొదటగా పూల మొక్కతో ఆదిలాబా ద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,2 టౌన్ సిఐ కె నాగరాజు జిల్లా ఎస్పీ ని ఆహ్వానించారు. పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకో వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాహనాలను పరిశీ లించి వాటి స్థితిగతులపై వి చారించారు. రిసెప్షన్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వెంటనే దర్యాప్తు అధి కారులను నియమించి విచారణ చేపట్టాలన్నారు. పట్టణంలో వార్డు పోలీస్ ఆఫీసర్ ప్రతిరోజు సంచరి స్తూ ఆసాంఘిక కార్యకలా పాల సమాచారాన్ని రాబ ట్టాలన్నారు. డయల్ హండ్రె డ్ వ్యవస్థను పాడు చేసేలా వ్యవహరించే వారిపై ఈ పెట్టి కేసులు నమోదు చేస్తూ చట్టప్రకారం వ్యవహరించాలని తెలిపారు. సిబ్బందితో మాట్లాడుతూ విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించ కూ డదని తెలిపారు. ప్రజల తో నీతి నిజాయితీతో నడుచు కోవాలని, విధులలో సమయపాలన, క్రమశిక్షణను అలవర్చుకోవాలని, పై అధికారి ఆదేశించిన ఆదేశాల ను తుచా – తప్పకుండా పాటిం చాలని తెలిపారు. పట్టణంలో రాత్రి సమయాలలో ఓపె న్ డ్రింకింగ్ తనిఖీలు చేస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ పటిష్టమైన చ ర్యలను తీసుకోవాలన్నారు. గంజాయి లభ్యం కాకుండా, గంజాయి రహిత జిల్లాను సృష్టించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గంజాయి సేవించిన, రవాణా చేసి న, వ్యాపారం చేసిన, వారిపై చట్ట ప్రకారం



చర్యలు తీసుకుంటూనే ఉండాలన్నారు. వర్టికల్ విధానం ద్వారా ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించా లన్నారు. పోలీసు పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్ల కుండా వీధుల నిర్వహణ ఉండాలని, పోలీసు ను కిం చపరిచే విధంగా ప్రవర్తించిన వారిపై కఠినంగా వ్యవహరిం చాలన్నారు. రౌడీలను సస్పెక్ట్ లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, వారి కదలికలను కట్టడి చేస్తూ ఉండాలన్నారు. న్యాయస్థానంలో నేర స్తులకు శిక్షలు పడినప్పు డు, సమాజం మంచి ప్రవర్తన కై అడుగులు పడతాయ న్నారు. ప్రతి ఒక్క సిబ్బంది సమయానుసారంగా విధుల నిర్వహణ చేపట్టాలని తెలి పారు. సిబ్బంది ప్రతి ఒక్క రూ శారీరక దృఢత్వాన్ని క లిగి ఉండాలని ప్రతి రోజు వ్యాయామం నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి



కేసు పూర్వపరాలు దర్యాప్తు పరిశోధన పై వివరాలను సమీక్షించారు. ఎలాంటి పెండెన్సీ లేకుండా దర్యాప్తు చేసి నేరస్తులకు శిక్షలు పడే విధంగా విచారణ చేప ట్టాలన్నారు. విధులను ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులను ప్రశంస పత్రాలను అందజేసి ప్రోత్సహించడం జరుగుతుం దన్నారు. రాత్రి గస్తీ నిర్వహి స్తున్న సమయంలో అను మానాస్పద వ్యక్తుల వేలి ముద్రలను సేకరిస్తూ, దొంగ లను పట్టుకుంటూ, ఆర్థిక నే రాల అరికట్టడంలో డైల్ హండ్రెడ్,పెట్రో కార్ సిబ్బంది చురుకుగా విధులను నిర్వర్తించాలని అన్నారు. ఈ కా ర్యక్రమంలో ఆదిలాబాద్ డి ఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీఐకె నాగరాజు, ఎస్సైలు ఎస్ జీవన్ రెడ్డి, అనిత, లీలా కృష్ణ, భీమ్ రావు, ఆర్ ఎస్ ఐ వినోద్, పోలీస్ స్టేషన్ సి బ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప జ్యువెల్ షాప్ పేరుతో వినియోగదారులను మోసం చేసిన రంగు రాము అరెస్ట్

నగల తయారీ, మరమ్మతుల పేరుతో కష్టమర్ల బంగారం, నగదు స్వాహా

వ్యసనాలకు బానిసై సొంత అవసరాల కోసం బంగారం తాకట్టు పెట్టి డబ్బులు వినియోగం

బోథ్ బస్ స్టాప్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకు న్న పోలీసులు

బోథ్ సీఐ డి. సాయినాథ్

బోథ్, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) బోథ్ పట్టణంలో గతంలో అ య్యప్ప జ్యువెల్ షాప్ నిర్వహించిన రంగు రాము (45) బోథ్, విని యోగదారులను మోసం చేసిన కేసులో బోథ్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు తన వద్దకు నగలు తయారు చేయించు కోవడానికి, మరమ్మతులు చేయించు కోవడానికి వచ్చే కష్టమర్ల న మ్మకాన్ని ఆసరాగా చేసుకొని వారి వద్ద నుండి బంగా రం, నగదు తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. చెడు వ్యసనాలకు బాని సై, సొంత అవసరాల కోసం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తూ, డబ్బులు లేక పోవడంతో కష్టమర్లను మో సం చేయడం ప్రారంభిం చాడు. ఈ క్రమంలో భారతి స మత సందీప్ కుమార్ వద్ద బంగారు గొలుసు తయారు చేస్తానని రూ.45,00 0 తీసుకొని గొలుసు, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. ముస్తాక్ అహ్మద్ షేక్ షేక్ అస్మత్ వద్ద 9 గ్రాముల బంగారం, రూ.15, 050 తీసుకొని రెండు జతల కమ్మలు తయారు చేసి ఇస్తానని మోసం చేశాడు అలాగే మల్లారపు విజయ బ్రహ్మయ్య వద్ద 3 గ్రాముల బంగారు కమ్మలు మరమ్మతుల కోసం తీసు కొని తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు ఇలా మరికొంత మంది కష్టమర్లను కూడా మోసం చేసి నట్లు విచారణలో వెల్లడైంది. కష్ట మర్ల నుండి తీసుకున్న బంగారు నగలను బోథ్ పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో సుమారు 10 గ్రాముల బంగారు గొలుసు, 6 కమ్మలను తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును కూడా తన సొంత అవ సరాల కోసం వినియోగించు కున్నాడు. అనంతరం పోలీ సులకు పట్టుబడతాననే భయంతో బోథ్ నుండి హైదరాబాద్‌కు పారిపోయా డు. ఈ రోజు తిరిగి బోథ్‌కు వచ్చి న సమయంలో బోథ్ బస్ స్టా ప్ వద్ద పోలీసులు నిందితుడిని అదు పులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితుడి వద్ద నుండి ఒప్పో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నా రు. ఈ సందర్భంగా బోథ్ సీఐ డి. సాయినాథ్ మాట్లాడు తూ



ప్రజలు తమ విలువైన బంగారు నగలను అప్పగించే సమయం లో అప్రమత్తంగా ఉండాలని, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడే వారి పై చట్టపరమైన చర్యలు తీ సుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎస్ ఐ వి. పురుషోత్తం పాల్గొన్నారు.

రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్ సేవలు అభినందనీయం

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12,(ప్రజా జ్యోతి) రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ రాథోడ్ జై సింగ్ అం దిస్తున్న వైద్య సేవలు అభి నందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు కొనియాడారు.రాత్రి, పగలు అనే తేడా లే కుండా ఎప్పుడు ఫోన్ చేసి నా స్పందిస్తూ, 24 గంటల పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరు ఫోన్ చేసినా తక్షణ మే స్పందించి, రోగులకు స రైన వైద్యం అందేలా అవస రమైన చర్యలు తీసుకుంటూ, వైద్య సేవల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ప్రశంసించారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా, అత్యవసర సమయాల్లో సైతం అందు బాటులో ఉంటూ వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయ మని తెలిపారు. ఇలాంటి సేవాభావం కలిగిన అధికారులు ప్ర భుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగిస్తారని అన్నారు. ఈ సందర్భంగా రాథోడ్ జై సింగ్ సేవలను అభినందించిన వారిలో గౌరవ ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, భరత్ చౌహన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎల్ ఎచ్ పిఎస్, ఆడే



సురేష్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఎల్ ఎచ్ పి ఎస్, రాథోడ్ భీమ్రావు ఏఐబిబిఎస్ జిల్లా అధ్యక్షులు, రాథోడ్ నారాయణ ఏఐ బి బిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాదో వెంకట్రావు రిటైర్డ్ ఎస్.ఈ., జాదవ్ ప్రవీ ణ్ మహారాజ్ ఏఐబిఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రా మ్ కిషన్ నాయక్, రిటైర్డ్ ఇండస్ట్రియల్ ఆఫీసర్, జా దవ్ శ్రీరామ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, దళిత సంఘం నాయకులు దుర్గం శేఖర్, సయ్యద్ కాశిం, గులాబ్ సింగ్, గంగారం నాయక్ మహారాజ్ తదితరులు పాల్గొ న్నారు.రాథోడ్ జై సింగ్ అందిస్తున్న ప్రజాసేవలు మరింత కొనసాగాలని వారు ఆ కాంక్షించారు.

క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు కలెక్టర్ కుమార్ దీపక్ సూచన

ఉద్యోగం సాధించడమే కాదు.. మెరిట్‌లో అగ్రస్థానమే లక్ష్యం కావాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా





మంచిర్యాల, 12,నవంబర్ (ప్రజాజ్యోతి): పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో లక్ష్య సాధనకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ఉద్యోగం సాధించడమే కాకుండా మెరిట్ జాబితాలో అగ్రస్థానం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగాల శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ.భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి వారి ప్రగతిని తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, గత రెండు నెలల కు పైగా సుమారు 400 మంది అభ్యర్థులు క్రమం తప్పకుండా శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ఉత్సాహం, పట్టుదలతో పరీక్ష పూర్తయ్యే వరకు చదువును కొనసాగించాలని సూచించారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శారీరక దృఢత్వ పరీక్షలకు అవసరమైన శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు. ఫిజికల్ టెస్టులకు ఇప్పటి నుంచే సాధన చేయాలన్నారు. కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలతో పాటు తమ విద్యార్హతలను బట్టి బ్యాంకింగ్, రైల్వే, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు కూడా సిద్ధం కావాలని సూచించారు. వివిధ పోటీ పరీక్షల్లో సబ్జెక్టులు, పరీక్షా విధానాల్లో సారూప్యత ఉంటుందని, ప్రస్తుత శిక్షణ ఇతర ఉద్యోగాల సాధనకు కూడా ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. ఉద్యోగం సాధించిన తరువాత పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, శిక్షణ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వం, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు.పోలీసు శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, 24 గంటలూ ప్రజల భద్రత కోసం పోలీసులు సేవలందిస్తారని కలెక్టర్ తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, శిక్షణ ప్రారంభమైనప్పటి నుంచి అభ్యర్థుల ప్రవర్తన, వస్త్రధారణ, సమయపాలన, క్రమశిక్షణలో గణనీయమైన మార్పు వచ్చిందన్నా రు. వారిని చూస్తుంటే ఇప్పటికే పోలీస్, ఆర్మీ నియామకాలకు సిద్ధమైన వారిలా కనిపిస్తున్నారని అభినందించారు. కేవలం ఉద్యోగం సాధించడమే కాకుండా మెరిట్‌లో అత్యుత్తమ స్థానం పొందాలనే సంకల్పంతో కృషి చేయాలని సూచించారు.కానిస్టేబుల్ ఉద్యోగం ఒక ప్రారంభం మాత్రమేనని, విధుల్లో చేరిన తరువాత ప్రతిభ, పనితీరు, కృషితో ఉన్నత పదవులను సాధించే అవకాశాలుంటాయని వివరించారు. శిక్షణలో నేర్చుకుంటున్న గణితం, రీజనింగ్, భాషా పరిజ్ఞానం ఇతర పోటీ పరీక్షలకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమపై పెట్టుకున్న ఆశలను స్ఫూర్తిగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.అభ్యర్థులకు విద్యాబోధనతో పాటు మంచి వ్యక్తిత్వం, నడవడిక, క్రమశిక్షణను నేర్పిస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సంపత్, ఆయన బృంద సభ్యుల కృషిని సీపీ అభినందించారు.అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పోలీ స్ అధికారులు, శిక్షణ బృంద సభ్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తా

దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ వచ్చేలా ప్ర భుత్వంతో మాట్లాడుతా

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 12, (ప్రజా జ్యోతి) అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభు త్వ సంక్షేమ పథకాల ఫలా లు అందేలా కృషి చేస్తా నని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్ అన్నారు. ఆదిలాబా ద్ రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేశారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెన్షన్ల కోసం దరఖా స్తులు చేసు కుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నిరుపేదల కష్టాలు వర్ణనాతీతమన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారు పెన్షన్ల కోసం ఎదురుచూడాల్సి రావడం బాధా కరమన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అ సెంబ్లీలో పలుమార్లు పెన్షన్ల మంజూరు కోసం ప్రస్తా వించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా పెన్షన్ల మంజూరు లో ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వం తెలిపినప్పటికీ, ఇతర ఖర్చులను తగ్గించైనా అర్హులకు పెన్షన్లు అందించాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పర్య టించినప్పుడు ఒంటరి మహిళలు, వితంతువులు, చిన్న వయసులోనే భర్తలను కోల్పోయి న మహిళలు, నిరుపేద కుటుంబాలు పెన్షన్ల కోసం దరఖాస్తులు అందజే స్తున్నారని తెలిపారు. పెన్షన్ ద్వారా వారికి ఎంతో కొంత ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు.పెన్షన్ల మంజూరు ప్రక్రియపై ప్రతి వారం డీఆర్డీ ఏ పీడీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలు సుకునేవాడి నని చెప్పారు. ఇంకా దరఖా స్తు చేసుకోని అర్హులైన వారు ఉంటే గుర్తించి దరఖాస్తు చేయించాలని గ్రామ సర్పంచు లకు సూచించారు. ఒంటరి మహిళలు, దయాలసిస్ రోగులు, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులైన వారు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకో వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు పెన్షన్లు మంజూరయ్యేలా ప్రభుత్వం తో మాట్లాడి తనవంతు కృ షి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, డీపీ ఓ రమేష్ తదితరులు పాల్గొ న్నారు.

కుమారిలో బీఆర్ఎస్‌కు కొత్త జోష్..

గులాబీ గూటికి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు!

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో పార్టీలో చేరిక

నేరడిగొండ, నవంబర్ 12 (ప్రజాజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోంది. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఈ క్రమంలో గురువారం మండలంలోని కుమారి గ్రామ ఉప సర్పంచ్ ఆడెపు రవితో పాటు వార్డు సభ్యులు మెస్రం సంబు, వోర్స సాయి యాదవ్, నందడెపు రవి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో వారు గులాబీ కండువాలు కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో నేరడిగొండ మాజీ జెడ్పీటీసీ గడ్డం భీమ్ రెడ్డి, వార్డు సభ్యుడు జి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.